



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

# విజయకేరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




ఆగస్టు 28 శుక్రవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 205 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సుద్ అహ్మద్

FRIDAY AUGUST 28 2026 | VOL:18 | ISSUE: 205 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed

## విరాహత్ అలీని పరామర్శించిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ బాధ్యులు



**గజ్వేల్:ఆగస్టు27**

మాతృ వియోగానికి గురైన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీని గురువారం ఉదయం గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ బాధ్యులు పరామర్శించి, బషారత్ ఉన్నిసా బేగం మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సాక్షి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ సిరిగిరి విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్, ఉపాధ్యక్షుడు ఎ. రాజేష్ లు విరాహత్ ను పరామర్శించి ఓదార్చారు.

## నేపాల్ వరదలు: తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్‌లైన్!

### నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీలో ప్రత్యేక కేంద్రం

### విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం



సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ల విడుదల

నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు

(మిగతా 2వ పేజీలో..)

# ఆటోలకు ఈ-బూస్ట్!

### 18,766 ఆటోల ఎలక్ట్రిక్ మార్పు

### రూ.200 కోట్లతో తెలంగాణ సర్కార్ పథకం



**హైదరాబాద్, ఆగస్టు 27:**

తెలంగాణలో ఆటోరిక్షా డ్రైవర్లకు ప్రయోజనం కల్పించడంతోపాటు కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక పథకానికి శ్రీకారం చుట్టింది. పెట్రోల్, డీజిల్‌తో నడిచే పాత ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు లిలి'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్-2026'లిలిను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.200 కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లపై రోజువారీ నిర్వహణ భారం తగ్గించడంతోపాటు కాలుష్య నియంత్రణకు ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

డ్రైవర్లకు ఇంధన ఖర్చు తగ్గే అవకాశం

పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ ఆటోల నిర్వహణ, ఇంధన వ్యయాలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో ఆటో డ్రైవర్లకు దీర్ఘకాలంలో నిర్వహణ ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుందని ప్రభుత్వం పేర్కొంటోంది. ముఖ్యంగా రోజువారీగా ఆటో నడిపే డ్రైవర్లపై ఇంధన ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ పథకం ఉపయోగపడనుంది.

కాలుష్య నియంత్రణకు ప్రాధాన్యం

రవాణా రంగంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. పాత పెట్రోల్, డీజిల్ ఆటోలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా

(మిగతా 2వ పేజీలో..)

## రాష్ట్ర ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్లగొండ ఆగస్టు 27 విజయకేరటం ప్రతినిధి**



సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి అని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టాల్లో అండగా నిలబడతాననే భరోసా, సుఖాల్లో కలిసి ఆనందించాలనే ఆప్యాయత, ఎన్ని పరిస్థితులు

(మిగతా 2వ పేజీలో..)

## డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు భవనాల శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి .

**హైదరాబాద్--విజయవాడ**

చీఎ-65పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చేపట్టిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.



చీఎ-65పై గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్ వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. చిట్యాల ఫ్లై ఓవర్‌ను ఈ దసరా నాటికి, మిగిలిన ఫ్లై ఓవర్లను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసి, సంక్రాంతి నాటికి వాహన రాకపోకలకు అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో రహదారులపై

(మిగతా 2వ పేజీలో..)

## నేపాల్‌లో ఏపీ యాత్రికులు.. రంగంలోకి దిగిన మంత్రి లోకేశ్

### ఏడుగురిలో నలుగురు క్షేమం, ముగ్గురి ఆచూకీ గల్లంతు

### క్షేమ సమాచారంపై అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

### యాత్రికులను రప్పించేందుకు రంగంలోకి దిగిన ప్రభుత్వం

### ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిరంతర పర్యవేక్షణ

కైలాస మానససరోవర యాత్రకు వెళ్లి నేపాల్‌లో సంభవించిన వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక: నేటి నుంచి లక్కీ డ్రా..



### హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ లబ్ధిదారుల ఎంపిక

### ఆగస్టు 28 నుంచి 31 వరకు లక్కీ డ్రా ప్రత్యక్ష ప్రసారం

### 7,340 ఫ్లాట్ల కోసం 40,900 మంది మధ్య పోటీ

### మధ్యవర్తులను నమ్మొద్దన్న అధికారులు

### ఎంపిక కానివారికి రూ.10,000 ఈఎండీ వాపసు

నగరంలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ (ఎల్ఐజీ ఫ్లాట్లు) లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు

(మిగతా 2వ పేజీలో..)

## నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

### నకిలీ వైద్యులపై హైదరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

### విద్యార్హతలు లేని కొందరు డాక్టర్లమంటూ చెలామణి అవుతున్నారన్న సజ్జనార్

### నకిలీ డాక్లర్ల బారిన పడొద్దని ప్రజలకు హెచ్చరిక

వైద్యం పేరుతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. నగరంలో కనీస అర్హతలు లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 12 మందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకున్నామని పోలీస్ కమిషనర్ సజ్జనార్ వెల్లడించారు.కనీస వైద్య విద్యార్హతలు, ఎలాంటి పరిజ్ఞానం లేని కొందరు వ్యక్తులు తాము డాక్టర్లమంటూ



విజయకేరటం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ బంధం

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, అనురాగం, నమ్మకానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగకు సర్వం సిద్ధమైంది. అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఈ పండుగను కుటుంబ సభ్యులంతా ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సోదరీమణులు తమ అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టి, వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. రాఖీ కట్టిన అనంతరం అన్నదమ్ములు తమ సోదరీమణులకు కానుకలు అందిస్తూ జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అన్నాచెల్లెళ్లు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకునే సందర్భం కావడంతో రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. దూర ప్రాంతాల్లో ఉన్న సోదరీమణులు సైతం తమ సోదరులను కలుసుకునేందుకు సొంతూళ్లకు చేరుకుంటున్నారు. దీంతో ఇళ్లలో పండుగ సందడి నెలకొంది.

### కొత్త డిజైన్లతో రాఖీల సందడి

రాఖీ పండుగ నేపథ్యంలో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని మార్కెట్లు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. చిన్నారులను ఆకట్టుకునే కార్టూన్ రాఖీల నుంచి సంప్రదాయ రాఖీలు, ముత్యాలు, రాళ్లు, పూసలతో తయారు చేసిన రాఖీల వరకు వివిధ రకాల డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. సోదరుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కూడా వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో రాఖీ దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపిస్తోంది.

### కానుకలకు ప్రత్యేక ప్రాధాన్యం

రాఖీతో పాటు సోదరీమణులకు కానుకలు ఇవ్వడం కూడా ఆనవాయితీగా వస్తోంది. దుస్తులు, చాక్లెట్లు, మిఠాయిలు, పండ్లు, గిఫ్ట్ ప్యాక్‌లతో పాటు వివిధ రకాల బహుమతులను అన్నదమ్ములు సిద్ధం చేసుకుంటున్నారు. సోదరీమణులు కూడా తమ అన్నదమ్ముల కోసం వారికి ఇష్టమైన వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో రాఖీలతో పాటు గిఫ్ట్ షాపులు, స్వీట్ షాపులు కూడా సందడిగా మారాయి.

### కుటుంబ బంధాలను గుర్తుచేసే పండుగ

ప్రస్తుత కాలంలో ఉద్యోగాలు, చదువులు, వ్యాపారాల కారణంగా కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాఖీ పౌర్ణమి అందరినీ ఒక్కచోట చేర్చే పండుగగా నిలుస్తోంది. ఎన్ని దూరాలు ఉన్నా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయతలు తగ్గవని గుర్తుచేస్తూ రాఖీ బంధం మరింత బలపడుతోంది. కుటుంబ విలువలు, ఆత్మీయ సంబంధాల ప్రాధాన్యాన్ని చాటిచెప్పే ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

### అనుబంధమే అసలైన కానుక

రాఖీ పండుగలో రాఖీ ఒక చిన్న దారమే అయినప్పటికీ, దానితో ముడిపడిన భావోద్వేగం ఎంతో గొప్పది. సోదరుడు--సోదరి మధ్య ప్రేమ, పరస్పర నమ్మకం, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే బంధానికి ఇది ప్రతీక. ఖరీదైన కానుకల కంటే ఆప్యాయతతో పలకరించుకోవడం, ఒకరికొకరు అండగా నిలవడం, కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందాన్ని పంచుకోవడమే రాఖీ పండుగ అసలైన సందేశం. ఈ నేపథ్యంలో రేపటి రాఖీ పౌర్ణమిని కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

# నకిలీ వైద్యులపై కఠిన నిఘా.. హైదరాబాద్ లో 12 మంది అరెస్ట్.. సజ్జనార్ తీవ్ర హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి)

చెలామణి అవుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు విచక్షణారహితంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, డయాబెటిస్ మందులను ఇస్తూ, ఇష్టారీతిన ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తున్నారని తెలిపారు. ఇటువంటి శాస్త్రీయత లేని వైద్యం వల్ల బాధితుల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు దెబ్బతిని ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా నకిలీ డాక్టర్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. క్లినిక్ లేదా ఆసుపత్రి రిసెప్షన్ వద్ద డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉందో లేదో కచ్చితంగా గమనించాలని తెలిపారు. అలాగే వైద్యుడి బోర్డుపై పేరు, చదివిన విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఒకవేళ వైద్యుడి అర్హతలపై కొద్దిగా అనుమానం వచ్చినా అధికారిక వెబ్‌సైట్ ద్వారా వివరాలు చెక్ చేసుకోవచ్చని, రికార్డుల్లో వివరాలు కనిపించకపోతే ఆ వైద్యుడిని నకిలీగా పరిగణించవచ్చని స్పష్టం చేశారు. తీసుకుంటున్న చికిత్సపై సందేహాలు ఉంటే వెంటనే అర్హత కలిగిన మరో డాక్టర్ వద్ద 'సెకండ్ ఒపీనియన్' తీసుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఎవరైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే 'డయల్ 112' కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ఆడుకునే నకిలీ డాక్టర్లపై నిరంతరం తనిఖీలు, కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# నేపాల్ వరదలు: తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్‌లైన్!

మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందించనున్నారు.ఈ కేంద్రం ద్వారా కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం, ఇతర ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, బాధితుల విజ్ఞప్తులపై తక్షణమే స్పందిస్తామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులు, యాత్రికులు, పర్యాటకులతో సంబంధాలు తెగిపోయిన వారు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. సహాయం కోరే వారు బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో వారు చివరిగా ఉన్న ప్రదేశం, టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు సమాచారాన్ని అందించాలని అధికారులు కోరారు. హెల్ప్‌లైన్ నంబర్లు: సహాయం అవసరమైన వారు రెసిడెంట్ కమిషనర్ పీ.ఎస్. వందన (9871999044), పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సి.హెచ్. చక్రవర్తి (9949351270), లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ (9618597969) నంబర్లలో సంప్రదించాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక: నేటి నుంచి లక్కీ డ్రా..

మొదటి పేజీ తరువాయి)

రంగం సిద్ధమైంది. ఆగస్టు 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు పూర్తి పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనుండటం గమనార్హం.హైదరాబాద్ క్యూర్ (సీయూఆర్‌ఈ) పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మించిన 7,340 ఫ్లాట్ల కోసం మొత్తం 60,720 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించిన అధికారులు 40,900 మందిని అర్హులుగా గుర్తించగా, 19,820 దరఖాస్తులను వివిధ కారణాలతో అనర్హమైనవిగా తేల్చారు. అర్హులైన దరఖాస్తుదారుల నుంచే లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.ఈ ప్రక్రియపై హౌసింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ వీపీ గౌతం మాట్లాడుతూ.. "లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. మధ్యవర్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దు. డబ్బులు తీసుకుని ఫ్లాట్ ఇప్పిస్తామని ఎవరైనా చెబితే మోసపోకండి. డ్రా ప్రక్రియను దరఖాస్తుదారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తున్నాం" అని స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సైతం ఈ వివరాలను వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకారం (ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, శానిటేషన్ వర్కర్లు) కేటాయింపులు జరుపుతామని తెలిపారు. ఆగస్టు 28న రాయదుర్గం, కేపీహెచ్‌బీ, 29న కౌకూర్, పాటిగడ్డ, 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, 31న గాజులరామారం, అంబర్‌పేట, పోచారం వంటి ప్రాంతాల్లోని ఫ్లాట్లకు డ్రా నిర్వహిస్తారు. లక్కీ డ్రాలో ఫ్లాట్ పొందని వారికి వారు చెల్లించిన రూ.10,000 ఈఎండీ మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దరఖాస్తుదారులు తేదీలు, లైవ్ స్ట్రీమింగ్ లింక్‌ల కోసం అధికారిక వెబ్‌సైట్లయిన tghb.telangana.gov.in లేదా మీసేవా పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు.

# నేపాల్‌లో ఏపీ యాత్రికులు.. రంగంలోకి దిగిన మంత్రి లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

దృష్టి సారించింది. ఏడుగురు యాత్రికులలో నలుగురు సురక్షితంగా ఉండగా, మరో ముగ్గురి ఆచూకీ తెలియరాలేదని అధికారులు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులతో మాట్లాడి తాజా వివరాలు తెలుసుకున్నారు.గల్లంతైన వారిలో కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ బృందంలోని శశికుమార్, రాజ్యలక్ష్మి ఉన్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద కనిపించినట్లు సమాచారం. గల్లంతైన ముగ్గురి ఆచూకీని త్వరగా కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని లోకేశ్ అధికారులను ఆదేశించారు.మరోవైపు, కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు యాత్రికులు క్షేమంగానే ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. సురక్షితంగా ఉన్నవారిని వీలైనంత త్వరగా రాష్ట్రానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యాత్రికుల భద్రత, తరలింపు విషయమై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలతో పాటు ఈషా ఫౌండేషన్‌తో నిరంతరం సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు, ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. యాత్రికుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



# ఆటోలకు ఈ-బూస్ట్!

మొదటి పేజీ తరువాయి)

మార్చడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణంపై కాలుష్య భారాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

### రూ.200 కోట్లతో భారీ కార్యక్రమం

18,766 ఆటోలను ఎలక్ట్రిక్‌గా మార్చేందుకు రూ.200 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ పథకం అమలు విధానం, లబ్ధిదారుల ఎంపిక, మార్పిడి ప్రక్రియ తదితర అంశాలపై ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలపై ఆటో డ్రైవర్లలో ఆసక్తి నెలకొంది.

# రాష్ట్ర ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

మొదటి పేజీ తరువాయి)

ఎదురైనా ఒకరికొకరు తోడుగా ఉండాలనే నమ్మకమే రాఖీ పండుగ స్ఫూర్తి అని మంత్రి అన్నారు. రాఖీ పౌర్ణమి ప్రతి ఇంట్లో ఆనందాన్ని, ప్రతి కుటుంబంలో ఆప్యాయతను నింపాలని... సోదర సోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలు జీవితాంతం ఇలాగే కొనసాగాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రోడ్లు భవనాల శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి .

మొదటి పేజీ తరువాయి)

రెయిలింగ్‌లు, హైమాస్ట్ లైట్లు, ఇతర రోడ్ సేఫ్టీ చర్యలను పటిష్టం చేయాలని చీనా× అధికారులకు సూచించారు. మూగజీవాలు రహదారిపైకి రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలను శాశ్వతంగా నివారించాలంటే చీఎ-65ను 6o2 లేన్‌లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో కలిసి కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ గారిని పలుమార్లు కలిశామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే తమ ధ్యేయమని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎలాంటి బేషజాలకు తావులేదని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులతో కలిసి మరోసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని, అవసరమైతే ప్రధానమంత్రిని కలిసి చీఎ-65 విస్తరణతో పాటు ఇతర చీనా× ప్రాజెక్టులను వేగంగా చేపట్టాలని కోరుతామని తెలిపారు.

# నల్లగొండ జిల్లా జైలును సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ..






- **భద్రతా పరంగా పటిష్ట చర్యలు చేపట్టాలని జైలు సూపరింటెండెంట్‌కు సూచనలు ..**

నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గురువారం నల్లగొండ జిల్లా జైలును సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్‌తో కలిసి జైలు పరిసరాలు, భద్రతా విధానాలు, సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేశ--నిష్క్రమణ ప్రాంతాలను పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జైలు భద్రతకు సంబంధించి సెక్యూరిటీ పాయింట్ ఆఫ్ వ్యూలో అవసరమైన సూచనలు, సలహాలను జైలు సూపరింటెండెంట్‌కు జిల్లా ఎస్పీ అందజేశారు. జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జైలు భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భద్రతాపరంగా అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఎస్పీ సూచించారు. సెక్యూరిటీ పాయింట్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా చూడాలని తెలిపారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. జైలులో భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, లోటుపాట్లు గుర్తించిన వెంటనే వాటిని సరిదిద్దాలని తెలిపారు.జైలు భద్రత విషయంలో పోలీసు శాఖ, జైలు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ, సమన్వయంతో పనిచేయడం ద్వారా జైలు భద్రతను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జైలు సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, అప్రమత్తతతో పాటు నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్శనలో జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హైవేపై ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి





**నల్లగొండ ఆగస్టు 27 విజయ కెరటం ప్రతినిధి**

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు హైవే పెట్రోలింగ్ పెంచడంతోపాటు, ప్రమాదాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని" జిల్లా స్థాయి జాతీయ రహదారి టాస్క్ ఫోర్స్ కమిటీ " నిర్ణయించింది. ఈ మేరకు గురువారం స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ రహదారి జిల్లా టాస్క్ ఫోర్స్ ససమావేశంలో బుధవారం తెల్లవారు ఝామున సూర్యపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం మొదలుకొని, జాతీయ రహదారిపై సంభవిస్తున్న రహదారి ప్రమాదాల పై సమీక్షించడం జరిగింది. ఈ సమీక్ష సందర్భంగా స్థానిక సంస్థల ఇన్చార్జి ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడంలో భాగంగా రహదారిపై ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసే సూచిక బోర్డులతో పాటు, దాబాలు,హోటళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై మరోసారి పూర్తిస్థాయిలో డ్రైవర్లు,ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు .రోడ్డుకిరుపక్కల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసే దాబాలు, హోటల్లు, వాహనాల కు గాలిని కొట్టే షాపులు, టీ కొట్లు, పాన్ డబ్బాల వంటివి రోడ్డుపై కాకుండా దూరంగా ఏర్పాటు చేసుకునేలా చూడాలని, ఇందుకు అవసరమైతే రోడ్డును ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు స్పందించకుంటే క్రేన్లు ఏర్పాటు చేసి తొలగించేలా చూడాలని అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ చర్యలు తీసుకునేందుకు ప్రతి 30, 40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అంబులెన్స్, క్రేన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ప్రమాదాలు సంబంధించినప్పుడు అంబులెన్స్, ఆసుపత్రి సిబ్బంది, పోలీసు, హైవే పెట్రోల్ సిబ్బంది తో పాటు, సంబంధిత శాఖలందరూ స్పందించాల్సిన అవసరం ఉందని, అలాగే డ్రైవర్లు నిరంతరం డ్రైవింగ్ చేయడం వలన ఉదయం సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అలా కాకుండా ప్రతి 2 గంటలకు ఒకసారి ఆగి తిరిగి డ్రైవింగ్ చేసేలా అవగాహన కల్పించాలని, అంతేకాక 80 కిలోమీటర్లు మించి వేగం వెళ్లకుండా నియంత్రించాలని, ఎవరైనా రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన జరిమానాలు విధించాలని, ట్రక్కులకు, లారీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ట్రక్ లే బేస్ లలో మాత్రమే వాహనాలు నిలిపేలా చూడాలని, నో పార్కింగ్ స్థలాలలో ఎట్టి పరిస్థితులలో వాహనాలు నిలపవద్దని, ఏదైనా ప్రమాదం జరిగి రహదారిపైనే వాహనాలు నిలిచిపోతే అక్కడ తప్పనిసరిగా సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని, సర్వీస్ రోడ్ల నుంచి ప్రధాన రహదారికి కలిసే చోట, అలాగే ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నచోట, పార్కింగ్ స్థలాల వద్ద అవసరమైన బోర్డులు ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించకుండా అన్ని నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరు వ్యక్తిగత భద్రతలో భాగంగా సీట్ బెల్ట్ , హెల్మెట్ ధరించాలని, రహదారులపై ప్రత్యేకించి జాతీయ రహదారిపై పెట్రోలింగ్ పెంచాలని ,1033 పై విస్తృత ప్రచారం కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెనాల్టీలు విధించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి దశరథ ,ఆర్ అండ్ బి, జాతీయ రహదారి, వైద్య ఆరోగ్య, పోలీస్,ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు

# మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి పరామర్శ

**వరంగల్ విజయ కెరటం ఆగస్టు 27:**

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గేదె కరుణాకర్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం పట్ల నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కరుణాకర్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మాధవరెడ్డి,గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ వద్దిరాజు పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్రలో భాగంగా సీపీసీఎల్ సందర్శన







చమురు సంస్థలు తమ కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర సంబంధిత అధికారులను కోరారు.పెట్రోలియం, సహజవాయువు శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యయన యాత్ర గురువారం తమిళనాడు రాజధాని చెన్నై,ఆ తర్వాత దాని సమీపాన ఉన్న మణలిలో కొనసాగింది.ఈ సందర్భంగా జరిగిన సమావేశాలలో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, దేశంలోని వినియోగదారుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని,ఉద్యోగ,ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు గాను తమ కార్యకలాపాల విస్తరణతో పాటు ప్రాంతీయ కార్యాలయాల సామర్థ్యాన్ని పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించాల్సిందిగా సలహాలిచ్చారు.తమ అధ్యయన యాత్రలో భాగంగా స్థాయీ సంఘం సభ్యులు గురువారం మధ్యాహ్నం మణలిలోని చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీసీఎల్) ప్రధాన రిఫైనరీని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు దాని కార్యకలాపాలు,పనితీరు గురించి సభ్యులకు వివరించారు.ఇది మద్రాస్ రిఫైనరీస్ లిమిటెడ్ (ఎంఆర్ఎల్)గా 1965లో నెలకొల్పబడి 2000 సంవత్సరంలో సీపీసీఎల్ అని పేరు మార్చుడం జరిగిందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ఇంధన అవసరాలను తీర్చడంలో ఈ చమురు శుద్ధి సంస్థ ప్రముఖ పాత్ర పోషిస్తున్నదని,ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉండగా,మణలిలో రిఫైనరీ నెలకొందని పేర్కొన్నారు.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)అనుబంధ సంస్థ అయిన సీపీసీఎల్ పెట్రోల్,డీజీల్,ఎల్పీజీ, ఏవియేషన్ టర్బైన్ ప్యూయల్ (ఏటీఎఫ్), కిరోసిన్,నాఫ్తా,పారఫిన్ వ్యాక్స్ తదితరాలను ఉత్పత్తి చేస్తుందని స్థాయీ సంఘం సభ్యులకు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర చమురు సంస్థలు వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన సత్వర సేవలందించేందుకు, కార్యకలాపాల విస్తరణతో పాటుగా సామర్థ్యాన్ని మరింత మెరుగు పర్చుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా అధికారులకు పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు. అధికారులు ఎంపీ వద్దిరాజుకు పూలమాల వేసి కండువాలతో సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు.స్థాయీ సంఘం అధ్యయన యాత్ర ఈనెల 21వతేదీన మహారాష్ట్రలోని రాయ్ గఢ్ జిల్లా ఉరాన్ వద్ద ప్రారంభమై,అటు తర్వాత ముంబాయి,ఊటీ,చెన్నైలలో కొనసాగి గురువారం మణలిలోని సీపీసీఎల్ సందర్శన తో ముగిసింది.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది: ఎమ్మెల్యే నాయిని...

**హనుమకొండ, ఆగస్టు 27: విజయ కెరటం ప్రతినిధి**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు.హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలనే తనకు కూడా ఉందని, సమస్యలపై పోరాడకుండా, తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో ఇప్పటికే చర్చించిన తర్వాతే తాను ధర్నా కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (OPS) పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులు--పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు.హెల్త్ కార్డులు, రిటైర్మెంట్‌కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ముఖ్యమంత్రిని కలసి సమస్యపై చర్చించేందుకు తాను కూడా వారితో కలిసి వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, వ్యవస్థాత్మకంగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఉద్యోగులు వివిధ పార్టీలకు అభిమానులుగా ఉండవచ్చని, అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.తాను ధర్నాకు వచ్చే ముందు కూడా ప్రభుత్వ పెద్దలతో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించానని, ఏ విధంగా ముందుకు వెళ్లాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించిన తర్వాతే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో ఈ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో TNGOs ప్రతినిధులు పాల్గొన్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

## ఎంజీఎంలో కనీస సౌకర్యాల కరువు!

**సెలైన్ స్టాండ్లు లేవు.. ఫ్యాన్లు లేవు..**
**రోగుల బంధువులే సౌకర్యాలు సమకూర్చుకోవాలా?**

**వరంగల్, విజయ కెరటం ఆగస్టు 27:**



పేదలకు మెరుగైన వైద్యం అందించాల్సిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు మౌలిక వసతుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తాజాగా ఆసుపత్రిలో ఓ చిన్నారి నడుస్తుండగా ఆమె వెంట ఉన్న మహిళ సెలైన్ బాటిల్‌ను చేతిలో పట్టుకుని నడుస్తున్న దృశ్యం ఆసుపత్రిలోని పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. మరోవైపు సెలైన్ బాటిళ్లను వేలాడదీయడానికి స్టాండ్లు అందుబాటులో లేక గోడకు సెలైన్ బాటిల్ వేలాడదీసే దుస్థితి నెలకొందని రోగుల బంధువులు చెబుతున్నారు.



**ఫ్యాన్లు లేక.. ఇంటి నుంచే తెచ్చుకోవాలా?**

ఆసుపత్రి వార్డుల్లో సరిపడా ఫ్యాన్లు లేకపోవడంతో కొందరు రోగుల బంధువులు ఇంటి నుంచి ఛార్జింగ్ ఫ్యాన్లు తెచ్చుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోనే ఇలాంటి కనీస సౌకర్యాల కొరత ఉంటే పేద రోగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**అధికారులు ఇకనైనా మేల్కొంటారా?**

రోగులకు అత్యవసరంగా అవసరమైన సెలైన్ స్టాండ్లు, గాలి ప్రసరణకు అవసరమైన ఫ్యాన్లు వంటి కనీస సదుపాయాలు కూడా అందుబాటులో లేకపోవడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. రోగులు వైద్యం కోసం వస్తే వసతుల కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలోని వార్డులను స్వయంగా పరిశీలించి, లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, పేద రోగులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

## బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్



**ఆగస్టు 27 విజయ కెరటం ప్రతినిధి**

కట్టంగూర్ గ్రామ, ముత్యాలమ్మ బోనాల పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం.అమ్మవారి ఆశీస్సులు కట్టంగూర్ గ్రామస్తులపై నిండుగా ఉండాలని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితాను పరిశీలిస్తున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు

**హనుమకొండ ఆగస్టు 27 విజయ కెరటం ప్రతినిధి:**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమాలను, గ్రామ సభను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు49వ డివిజన్ వార్డ్ సభ : వరంగల్ వెస్ట్ నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 49వ డివిజన్‌లోని రామాలయం మరియు ట్రైబల్ వెల్ఫేర్ ఎస్సీ, ఎస్టీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్డ్ సభలను(ఓటరు నమోదు, సవరణ కేంద్రాలను) ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు, సమన్వయకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగపురి కిరణ్, మాజీ కార్పొరేటర్ రామ్ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరు గ్రామ సభలో కలెక్టర్‌తో పాల్గొన్నారు : అనంతరం హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామంలో జరిగిన ప్రత్యేక గ్రామ సభకు హాజరయ్యారు. ఈ గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీమతి ఛాహత్ బాజ్‌పాయ్ తో కలిసి ఓటరు జాబితాలోని అభ్యంతరాలు, చేర్పులు,



మార్పులపై స్థానిక ప్రజలతో చర్చించారు. కొత్త ఓట్ల నమోదు, ముసాయిదా జాబితాలోని మార్పులకు సంబంధించి గ్రామస్తులు లేవనెత్తిన పలు సందేహాలను అధికారుల సమక్షంలో నివృత్తి చేశారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా అర్హులైన ఏ ఒక్కరికీ ఓటు హక్కు దూరం కాకుండా చూడాలని, మరణించిన వారి లేదా డూప్లికేట్ ఓట్లను పూర్తి నిబంధనల ప్రకారం తొలగించాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను, రెవెన్యూ అధికారులను కోరారు.



# కృతి సనన్ యాడ్ రగడ.. నెటిజన్ల నీతులకు చిన్మయి ఘాటు కౌంటర్!

### కృతి సనన్ రక్షా బంధన్ యాడ్ వివాదాస్పదం

### ఆమె ధరించిన దుస్తులు భారతీయ సంస్కృతి, రాఖీ పండుగ పవిత్రతకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శలు

### డేరా బాబాకు పదేపదే లభిస్తున్న పెరోల్ గురించి ఎందుకు మాట్లాడరన్న చిన్మయి

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ నటించిన ఒక రక్షా బంధన్ వాణిజ్య ప్రకటన (యాడ్) తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ యాడ్‌లో కృతి ధరించిన దుస్తులు భారతీయ సంస్కృతి, రాఖీ పండుగ పవిత్రతకు విరుద్ధంగా ఉన్నాయంటూ పలువురు నెటిజన్లు ఆమెపై తీవ్రస్థాయిలో ట్రోలింగ్ మొదలుపెట్టారు.ఈ వ్యవహారంపై ప్రముఖ గాయని చిన్మయి స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. కృతి సనన్‌ను విమర్శిస్తున్న వారి వైఖరిని ఎండగడుతూనే... అత్యాచారం కేసులో శిక్ష అనుభవిస్తున్న డేరా సచ్చా సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు పదేపదే పెరోల్ లభిస్తున్న అంశాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఒక మహిళ వేసుకున్న దుస్తులను, ఒక ప్రకటనను 'సంస్కృతి' పేరుతో తప్పుపట్టే సమాజం... తీవ్రమైన నేరాలకు పాల్పడిన వ్యక్తికి వరుసగా పెరోల్‌లు లభిస్తుంటే ఎందుకు మౌనంగా ఉందో చెప్పాలని చిన్మయి ప్రశ్నించారు. మహిళల బట్టలపై నీతులు చెప్పే జనాలు, ఇలాంటి తీవ్ర నేరస్థుల విషయంలో మాత్రం ద్వంద్వ ప్రమాణాలు పాటించడం ఏ రకమైన న్యాయమని నిలదీశారు. చిన్మయి చేసిన ఈ కామెంట్స్‌తో సోషల్ మీడియాలో సరికొత్త చర్చ మొదలైంది. ఆమె లేవనెత్తిన సామాజిక కోణాన్ని, నిలదీతను పలువురు సమర్థిస్తుండగా... రాఖీ యాడ్ వివాదాన్ని నేరస్థుడి పెరోల్ అంశంతో ముడిపెట్టడం సరికాదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద కృతి సనన్ రాఖీ యాడ్, దానిపై చిన్మయి స్పందించిన తీరు ప్రస్తుతం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528